క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంగేరు సచివాలయం పరిధిలోని-1, కోటిపల్లిలో-1, కుందూరులో-1 పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం 16న సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి 20న పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామన్నారు.

అంగరలో శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ



అంగరలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో శ్రీపార్వతి, ఉమామహేశ్వర, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ నిర్వహించారు. వేద పండితుడు కొమాళ్ళపల్లి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో కమాళ్ళపల్లి సత్య సుబ్రహ్మణ్యం, శ్రీకంఠం మల్లేశ్వరశర్మ బ్రహ్మత్వంలో సంకల్ప పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రి గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం ఆలయం కార్తిక వన సమారాధన నిర్వహిస్తామన్నారు.

వల్లూరులో మహాకుంభాభిషేక పూజలు



వల్లూరులో స్వామికి పుణ్య జలంతో అభిషేకం చేస్తున్న లీలాకృష్ణ

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో శుక్రవారం మహా కుంభాభిషేకం పూజలు చేశారు. గ్రామంలోని శివాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం తదితర ఆధ్యాత్మిక కేంద్రాల్లో దేశం నలుమూలల నుంచి తీసుకొచ్చిన పుణ్య జలాలతో అభిషేకం చేశారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. వేద పండితులు దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలా కృష్ణ, గ్రామ ప్రముఖులు వల్లూరి వీరబాబు, భక్తులు దేవతామూర్తులకు పూజలు చేశారు.

స్వమిత్ర సర్వేతో స్థిరాస్తికి రక్షణ



కపిలేశ్వరపురంలో ఇంటి కొలతలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

కపిలేశ్వరపురం: స్వమిత్ర సర్వేతో గ్రామస్తుల స్థిరాస్తికి పూర్తి రక్షణ కలుగుతుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన పర్యవేక్షణలో కపిలేశ్వరపురంలో సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వమిత్వ సర్వే చేశారు. రికార్డులు ఆధారంగా నివాసాల యాజమానుల సమక్షంలో కొలతలు తీశారు. సంబంధిత అంశాలను రికార్డుల్లో నమోదు చేశారు.

క్విజ్ పోటీల్లో వెలగతోడు విద్యార్థుల ప్రతిభ



కాకినాడలో సైకిళ్ళను బహుమతిగా అందుకుంటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): కాకినాడ జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలో మండపేట మండలం వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తృతీయ స్థానంలో నిలిచిన ఈ పాఠశాల విద్యార్థులు పొంద్రంకి వెంకటేశన్, ఇమ్మంది కౌశిక్‌కుమార్‌లు సైకిళ్లు బహుమతిగా పొందారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, మహమ్మద్ సఫీర్ అహ్మద్ బహుమతుల ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు 'డయల్ యువర్ డీఎం'

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలో 10న ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సూచనలు, సలహాలను ఫోన్ నంబరు 99592 25536కు తెలియజేయాలని కోరారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

- వేడుకలకు ముస్తాబవుతున్న చర్చిలు
- ఆకట్టుకుంటున్న అలంకరణలు



చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్



షాపుల వద్ద అమ్మకానికి సిద్ధంగా క్రిస్మస్ స్టార్స్



విద్యుత్ దీపాలంకరణ వెలుగుల్లో చర్చి

రాయవరం: సత్యం, శాంతి, త్యాగం, కరుణ, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశంతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. లోక రక్షకుడిగా కీర్తింపబడుతున్న ఏసు జననం లోకానికి పర్వదినం. శాంతి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్న క్రిస్మస్ పండుగ నిర్వహణకు క్లస్టర్ పరిధిలోని క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. డిసెంబరు మాసం ప్రారంభం నుంచే క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చిలను ముస్తాబు చేసి, స్టార్‌లు వేలాడదీస్తున్నారు. చర్చిల్లో భక్తి శ్రద్ధలతో వారు క్రిస్మస్ పండుగ స్వాగత ప్రార్థనలు చేస్తున్నారు. ఈ నెల 25న క్రిస్మస్ సందర్భంగా క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని 120 గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది.

ప్రారంభమైన వేడుకలు

డిసెంబరు మొదటి వారం నుంచే క్రిస్మస్ వేడుకలు క్లస్టర్ పరిధిలో ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే పలు చోట్ల యూత్ క్రిస్మస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలంతా క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నాటికలు, సెలబ్రిటీల సాక్ష్యాలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు, క్రీస్తు పుట్టుకను వివరిస్తూ పశువుల పాకలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొతుల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నారు. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని మననం చేసుకుంటూ క్రైస్తవులు గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, గీతాలను ఆలపిస్తూ పలు చర్చిల్లో కేక్‌లను కట్ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సుందరంగా ముస్తాబు

లోక రక్షకుడైన ఏసుక్రీస్తు పుట్టిన రోజు పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చిలను క్రిస్మస్ ట్రీలు, వెలుగులు విరజిమ్మే నక్షత్రాలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ నక్షత్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని చర్చిలకు రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ఈ నెల 1 నుంచి గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే నాటికలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు పలువురిని అలరిస్తున్నాయి. క్రిస్మస్ ప్రత్యేక గీతాలను ఆలపించడంతో పాటు బాణసంచా కాల్చి ఆనందంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. మరో పక్షం రోజుల్లో క్రిస్మస్ పర్వదినం రానున్న సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రతిభ ఆధారంగా జీవన ప్రమాణాలు మెరుగు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- క్విజ్ పోటీల విజేతలకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



మండపేట గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): విద్యార్థి దశలో చూపే ప్రతిభ ఆధారంగా జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవచ్చని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలో మండపేట పట్టణంలోని గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎస్.పావనీదుర్గ, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్.దీక్షితలు మొదటి స్థానంలో నిలిచారు. వారిరువురికీ రూ.50 వేల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను, వారికి శిక్షణ నిచ్చిన పి.రామచంద్రారెడ్డిలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థినులను అభినందించిన వారిలో హెచ్ఎం సీహెచ్ శోభావలి, ఎంపీడీఓ ఐదం రాజు, ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సీహెచ్ సోమిరెడ్డిలు, ప్రముఖ హోమియో వైద్యులు చల్లా రవికుమార్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు డీవీ రాఘవులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి



వెదురుమూడిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అబ్బు

కపిలేశ్వరపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు అన్నారు. వెదురుమూడి గ్రామంలో శుక్రవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి వెలగల లక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ చోడే రామలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అబ్బు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చోడే సూరిబాబు, నక్కా సింహాచలం మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి రానున్న ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అవసరమన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారా రైతులను ఆదుకుంటాం



శివలలో నేలనంటిన పంట పొలాలను పరిశీలిస్తున్న సర్పంచ్ సాయి తదితరులు

కె.గంగవరం: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ అనసూరి సాయి అన్నారు. మండలంలోని శివలలో మునిగిపోయిన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దృష్టికి పంట నష్టపోయిన వివరాలు అందించామని ఆయన చొరవతో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. తడిచిన ధాన్యాన్ని కూడా తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, కూరాటి రాజేంద్ర, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సామూహికంగా సత్యదేవుని వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పవిత్ర కార్తిక మాసం, శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద గల గీతా జ్ఞాన మందిరంలో ఈ వ్రతాలు చేశారు. గీతా మందిరం నిర్వాహకులు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతాల్లో సుమారు 100 మంది దంపతులు పాల్గొన్నారు. వేద పండితులు ఇటికరాల సుబ్రహ్మణ్య శర్మ, అంగర జనార్దనాచార్యులు వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు తాడి వెంకటరెడ్డి, ధనలక్ష్మి దంపతుల కుమారులు శ్రీనివాసరెడ్డి, బులివెంకటరెడ్డి ప్రసాద వితరణ చేశారు.

శిథిలావస్థలో వంతెన



వట్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి–వట్రపూడిలో రహదారిలో గల వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిని నిత్యం వందలాంది మంది ప్రజలు ఉపయోగించుకుని అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం మండలం ద్రాక్షారామలకు చేరుకుంటారు. ఈ రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేవు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన పూర్తిగా పడిపోయే స్థితిలో ఉందని వారు అంటున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం జగనన్న రైతుల పక్షపాతి



తణుకువాదలో పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న గుత్తుల బులిరాజు

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని ఆపదలో ఉన్న ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో బులిరాజు పర్యటించి వర్షాలకు నీటమునిగిన పంట పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. తణుకువాడలో పలువురు రైతులు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో పంటలు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మండల గ్రామాల్లో అధిక శాతం పంట కోతలు పూర్తయ్యి ధాన్యం పొలాల్లో రాశుల రూపేణా ఉందన్నారు. వర్షాలకు నీరు రాశుల కిందకు వెళితే ధాన్యం తడిసి రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనలకు గురవుతున్నారన్నారు. అయితే రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని రైతుల కష్టాలను తీర్చటంలో సీఎం జగనన్న ఎప్పుడూ ముందుగానే ఆలోచన చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రమణ్యం, తణుకువాడ మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, డి.వెంకటరమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి రాట ముహూర్తం



వీరాంజనేయస్వామి వారి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశకు రాట ముహూర్తం

రామచంద్రపురం: స్థానిక రాజగోపాల్ సెంటర్లో కొలువైన సీతారామ భక్త వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈనెల 23న జరిగే ముక్కోటి ఏకాదశ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయం వద్ద రాట ముహూర్తం చేశారు. పట్టణానికి చెందిన కొండేటి లక్ష్మణరావు చేతుల మీదుగా అర్చకులు తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాకశాసన స్వామికి లక్ష బిల్వార్చన



ద్రాక్షారామలో పాకశాసన స్వామికి లక్ష బిల్వార్చన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సప్త గోదావరి ఒడ్డున వేంచేసిన సర్వ మంగళాదేవీ సమేత పాకశాసన స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు కొంతేటి విశ్వనాథశర్మ బ్రహ్మత్వంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సోమేశ్వరస్వామికి విశేష పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరులో వేంచేసిన బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తిక ఏకాదశి విశేష పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం గ్రామ మాజీ సర్పంచ్ కొండేపూడి జానకిరామయ్య, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. దొంతికుర్తి ఈశ్వరశర్మ బ్రహ్మత్వంలో 21 మంది వేద పండితులతో విఘ్నేశ్వర పూజ, ఏకాదశ రుద్రమండప ఆరాధన, నవ గ్రహారాధన, సూర్య నమస్కారాలు, లింగార్చన, లక్ష్మీ నారాయణ పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వి. శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఓదూరులో విశేష పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి



మంత్రి వేణును కలిసిన న్యాయవాదులు

రామచంద్రపురం: త్వరలోనే పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంత్రి వేణును కలిశారు. ఇటీవల మంత్రి వేణు అనారోగ్యానికి గరైన నేపథ్యంలో మంత్రి వేణును మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, వాడ్రేవు సాయిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ



మండపేటలో కార్తిక వన సమారాధన ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): ఈనెల 10న మండపేట పట్టణంలోని గొల్లపుంత రోడ్డులో నిర్వహించే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కార్తిక వన సమారాధన ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ఆ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనుచరులుతో కలిసి కార్యక్రమ స్థలాన్ని పరిశీలించారు. నిర్వాహక కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులతో చర్చించారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ అభిమానులు తరలి రానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ కన్వీనర్లు



కన్వీనర్లకు నియామక పత్రాలు అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ప్రభాకరరావు

అమలాపురం టౌన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నియమించిన ఏడుగురు కన్వీనర్లకు బాధ్యతలను అప్పగిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు నియామక పత్రాలను అందించారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గానికి కన్వీనర్‌గా నియమితులైన వంటెద్దు బాబి, అమాపురానికి వాకపల్లి రాంబాబు, రాజోలుకు కుడుపూడి శ్రీనివాసరావు, ముమ్మిడివరానికి గెద్దం సురేష్‌బాబు, కొత్తపేటకు పి.ఉదయ భాస్కరవర్మ, మండపేటకు గాలింక చిట్టిబాబు, రామచంద్రపురానికి సంగిత సత్యనారాయణకు నియామక పత్రాలు అందించి బాధ్యతలు అప్పగించారు.

ఆరోగ్య సర్వేతో గ్రామ ఆరోగ్య పరిరక్షణ



పడమర ఖండ్రిక ఆరోగ్య సర్వేలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: ఆరోగ్య సర్వేతో ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల సిబ్బంది గ్రామాల్లో సర్వే చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పీహెచ్‌సీల వైద్యులు పి.రత్నకుమారి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి మాట్లాడుతూ జ్వరాలున్నవారికి ఉచితంగా మందులు అంజేస్తున్నామన్నారు. జ్వరం తగ్గని పక్షంలో ఆసుపత్రిని రావాలని సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈబీవీ రామారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయండి

రామచంద్రపురం: ఈనెల 12 నుంచి జరగబోయే గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని, న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగుల సంఘం నేతలు పిలుపు నిచ్చారు. కేంద్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం సాయంత్రం డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ హాల్లో సమ్మె సన్నాహక సభ బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్వీ మునేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు తెనాలి పోస్టల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈవో కామ్రేడ్ డి.శివనాగేశ్వరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారు. తెనాలి డివిజనల్ కార్యదర్శి విజయ్‌కుమార్, గుంటూరు పోస్టుమన్ ఉద్యోగుల కార్యదర్శి డి.అప్పారావు, సీనియర్ సంఘ నాయకుడు పాల్గొని ప్రసంగించారు. కోశాధికారి కామేశ్వరి, నాయకులు జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.